క్లుప్తంగా

అమ్మవార్లకు శ్రావణమాస సారె సమర్పణ



జికొండూరు: శ్రావణమాసం సందర్భంగా జికొండూరులోని శ్రీసీతమ్మ అమ్మ వారు, శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోని శ్రీరాజ్యలక్ష్మీ, ఆండాళ్లమ్మ వార్లకు పలువురు మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రావణమాసం సారె ఆదివారం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు పెదగమళ్ల నాగరాజు, నాగరాణి దంపతులు మేళతాళాలతో ఊరేగింపుగా సారెతో ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు గాజులు, గోరింటాకు అందజేశారు. విగ్రహదాత సతీమణి పెద్దగమళ్ల పద్మావతి, భజన భక్తబృందం సుజాత, శేషుబాల, ధనలక్ష్మి, మహాలక్ష్మి, కవిత, రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వసంతకు సత్కారం



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండపంచాయతీ సర్పంచి నెలకుర్తి నళినీ ఆశాలత, పంచాయతీ కార్యదర్శి సరోజాబాయ్ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను ఐతవరంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు పఠాన్‌నాగుల్ మీరా, అచ్చారావు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో అర్చకబృందంచే విష్వక్సేన పూజతో రెండోరోజు ప్రత్యేక పూజలు ప్రారంభించారు. పుణ్యాహవచన, పవిత్రశుద్ధి, కుండేషు అగ్నిప్రతిష్టాపన, త్రేతాగ్ని హోమాలు, పవిత్రమాలలకు శయనాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కావూరి శశిరేఖ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు



తిరువూరు: శ్రావణమాసం సందర్భంగా తిరువూరు జగన్నాథపురం కాలనీలోని ముత్యాలమ్మ దేవస్థానాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి భక్తులు విశేషపూజలు నిర్వహించారు. పాతతిరువూరు, రాజుపేట, పీటీకొత్తూరులో గ్రామదేవతల విగ్రహాలకు విశేషాలంకరణ చేసి మొక్కులు సమర్పించుకున్నారు.

ఇంగ్లిష్ ఉపాధ్యాయినికి సావిత్రీబాయి పూలే అవార్డు



నూజివీడు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో ఇంగ్లిష్ ఉపాధ్యాయిని ములగలేటి ఉమా జాతీయ స్థాయి సావిత్రీబాయి పూలే ఉమన్ టీచర్స్ ఫెడరేషన్ నుంచి అవార్డును ఆదివారం అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రం దార్వాడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ప్రాథమిక, సెకండరీ విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. అంతేగాకుండా ఉమాను సావిత్రీబాయి పూలే ఉమన్ టీచర్స్ అసోసియేషన్‌కు కోశాధికారిగా సైతం నియమించారు.

మహిళా సాధికారతపై అవగాహన ఉండాలి

మైలవరం: మహిళా సాధికారతపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని మదర్ థెరీస్సా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సహేలీ గర్ల్స్ క్లబ్, ఐసీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం మదర్ థెరీస్సా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నేటి సమాజంలో మహిళల పాత్ర అనే అంశంపై కళాశాల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులకు అవగాహన కల్పించారు.

గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి

నూజివీడు: ఉమ్మడి కృష్ణా జిల్లాలో అతిపెద్ద కాలనీగా ఉన్న నూజివీడు పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో అంతర్గత రహదారులను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో 2006లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో నాలుగు వేల మంది పేదలకు నివేశన స్థలాలను ఇచ్చి ఎమ్మార్ అప్పారావు కాలనీని ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలోని పేదలందరికీ ఆనాడు నివేశన స్థలాలను ఇవ్వడమే కాకుండా ఇందిరమ్మ గృహాలను సైతం మంజూరు చేశారు. ఆనాడు పునాదులు పడిన కాలనీ నేడు మేజర్ పంచాయతీ స్థాయికి అభివృద్ధి చెందింది. 2009 నుంచి 2019 వరకు ఈ కాలనీ అభివృద్ధికి నోచుకోలేదు. ఈ పరిస్థితిలో కాలనీలో నివాసముంటున్న సుమారు ఐదు వేల మంది ప్రజలు సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం అయితే బురదరోడ్లలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చేది. ఖాళీస్థలాలు, మట్టిరోడ్ల వెంబడి పిచ్చి చెట్లు దట్టంగా పెరిగి పాములకు, విష పురుగులకు,సర్పాలకు నిలయంగా ఉండేవి. పాములు ఇళ్లల్లోకి సైతం వచ్చేవి. ఈ కాలనీలో నివసించే పేద, మధ్య తరగతి ప్రజలందరూ ఉదయం పనులకు, ప్రైవేటు ఉద్యోగాలకు వెళ్లి సాయంత్రం ఇళ్లకు చేరుకుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టారు.

30 అంతర్గత రోడ్ల అభివృద్ధి

ఏడాది క్రితం దాదాపు రూ.4 కోట్ల ఆర్థిక సంఘం నిధులతో దాదాపు 30 అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. అయితే ఇంకా అనేక అంతర్గత రహదారులు మట్టిరోడ్లుగానే ఉండి ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మున్సిపల్ అధికారులతో మాట్లాడి ముందుగా మట్టిరోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేసే పనులను ప్రారంభింప చేశారు. గత 15 రోజుల నుంచి కాలనీలోని అంతర్గత రహదారులకు గ్రావెల్ తోలి రోలింగ్ చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 2,500 ట్రిప్పుల గ్రావెల్‌ను తోలి 30 అంతర్గత రహదారులను అభివృద్ధి చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేసిన అంతర్గత రహదారి

కాలనీ వాసుల కష్టాలు తీరాయి



అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి చేయడంతో మా కష్టాలు తీరాయి. వర్షం కురిసినప్పుడు ఇప్పటి వరకు బురదలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చేది. మా బాధలు తెలుసుకుని వాటిని పరిష్కరించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుకు కృతజ్ఞతలు.

– గుణదల రాజు, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గతంలో పాలించిన కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఎమ్మార్ అప్పారావు కాలనీ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. కాలనీలో రోడ్లకు తట్ట మట్టి కూడా పోయలేదు. దీంతో ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు కృషితో అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందాయి

– షేక్ మస్తాన్‌వలీ, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

ఎమ్మెల్యే ప్రతాప్ వల్లే అభివృద్ధి



పేదలకు నివేశన స్థలాలను ఇవ్వడమే కాకుండా, దీనిని అభివృద్ధి కూడా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వల్లే జరుగుతోంది. పేదల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం. నిరంతరం పేదల పక్షాన ఉండి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారు.

– నౌషత్ బేగం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం 30కి వాయిదా

నూజివీడు: నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులకు ఈ నెల 28న నిర్వహించాల్సిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఈ నెల 30వ తేదీకి వాయిదా వేసినట్లు డీవైఈఓ ఎం.సేవియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సమావేశం వాయిదా వేశామని పేర్కొన్నారు. నూజివీడులోని డీవైఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తామని, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లోని వ్యాయామోపాధ్యాయులు పాల్గొనాలని తెలిపారు. ఇందులో పలు ఆటలు, క్రీడల్లో మెలకువలు, రోజువారీ కార్యక్రమ నిర్వహణపై వివరిస్తామని పేర్కొన్నారు.

మదర్ థెరీస్సాకు ఘన నివాళి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మానవసేవే మాధవ సేవ సూక్తికి నిదర్శనం మదర్ థెరీస్సా అని క్యాపో సొసైటీ అధ్యక్షుడు, కొండపల్లి మున్సిపాల్టీ ఐదో వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ అన్నారు. కొండపల్లిలో మదర్ థెరీస్సా జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. క్యాపో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రతాప్‌కు సత్కారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా ఆగిరిపల్లి మండల సీనియర్ నాయకుడు మచ్చ హరిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలుగా తులిమెల్లి పావని జ్యోతికుమారి నియమితులైన సందర్భంగా వారు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును ఆదివారం ఘనంగా సత్కరించారు. తమను జిల్లా పదవుల్లో నియమించినందుకు ఎమ్మెల్యే ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్ల అనూష, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఈదులగూడెం సొసైటీ అధ్యక్షుడు ఈలప్రోలు వెంకటసుబ్బయ్య, వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీ హర్ష, నాయకుడు గొల్ల ఇస్సాకు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఆగిరిపల్లి మండల వైఎస్సార్ సీపీ నాయకులు

ఠాగూర్ గ్రంథాలయంలో సంగీత శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా సరస్వతీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు సంగీత శిక్షణ తరగతులు నిర్వహించారు. సంగీత శిక్షకురాలు ఎం.దివ్య మాధురి విద్యార్థులకు సంగీతంపై అవగాహన కల్పించారు. సరళి స్వరాలు అనే అధ్యాయంతో తరగతులు ప్రారంభించారు. దివ్య, మాధురి మాట్లాడుతూ సరళి స్వరాలు, సంగీతంలో వాటి ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. సరళి స్వరాలు ఎలా రాయాలి? పంచ స్థా యిలను వివరించారు. నోటేషన్ రాసే విధానం, దా ని ఆవశ్యకతను తెలియజేశారు. స్థాయిల్లో మధ్య, తారా, మంద్ర, అనుమంద్ర, అతితార స్థాయిలు వివరించారు, సప్త స్వరాలు పలికే విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల చేత సప్త స్వరాలు పలికించి సాధన చేయించారు. తరగతిలో నేర్చుకున్న అంశాలపై ఇంటి వద్ద సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మి పాల్గొన్నారు.



సంగీత పాఠాలు బోధిస్తున్న అధ్యాపకురాలు మాధురి

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు మానండి

ముసునూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, ఆయన తనయుడిపై అనుచిత వ్యాఖ్యలు, దుష్ప్రచారాలు మానుకోవాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను, టీడీపీ శ్రేణులను వైఎస్సార్ సీపీ నేతలు హెచ్చరించారు. ముసునూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి లోకేష్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ కేటుగాడు అనే పదానికి అర్థం తెలుసా, ఎవరికి వాడాల్సిన పదాన్ని ఎవరికి వాడావో సరిగ్గా తెలుసుకో, జన్మభూమి కమిటీలతో ప్రజలందరినీ మోసం చేసిన నువ్వు, నీ తండ్రి కేటుగాళ్లు. ఆ పదం మీది, మీ ఇద్దరే దానికి బ్రాండ్ అంబాసిడర్లు. రాష్ట్ర స్థాయిలో పాదయాత్ర చేస్తూ, మండల కేంద్రంలో గ్రామ స్థాయి రచ్చబండ నిర్వహించడం పిల్లలతో బొమ్మరిల్లు ఆట ఆడుకున్నట్లుందని విమర్శించారు. విమర్శలు చేసే ముందు ఆలోచించి, స్థాయికి తగిన విమర్శలు చేయాలని, చౌకబారు విమర్శలు, రాజకీయాలు చేయవద్దన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ గంగాధర్ మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ ప్రజలతో మమేకమై, నిత్యం కలసి ఉండే నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావుపై గెలవాలనుకోవడం వారి అమాయకత్వమేనని, అభ్యర్థిని ప్రకటించకుండా జెండా ఎగరేస్తే అభివృద్ధి చేస్తా అనడం చివరకు అభాసుపాలు కావడమేనని కాట్రేనిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు కంబాల రాంబాబు పేర్కొన్నారు. యువగళం పేరుతో నియోజకవర్గంలో అలజడులు రేపాలని టీడీపీ శ్రేణులు పన్నిన కుట్రలను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీపీ కృష్ణకుమారి, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



విస్సన్నపేట: స్థానిక ఎ కొండూరు రోడ్డులోని జీవీఆర్ హెల్త్ కేర్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. జీవీఆర్ హెల్త్ కేర్ నిర్వాహకుడు కిడ్నీ వైద్యనిపుణులు గొల్ల అన్వేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి, ఎముకల, చర్మ, గుండె వైద్యనిపుణులు డాక్టర్ హారిక, పవన్‌కుమార్, ఉదయ శర్వాణి, రఘురామ్ పాల్గొని 275 మందికి పరీక్షలు నిర్వహించారు.

గొలుసుకట్టు వ్యాపారంపై ఫిర్యాదు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ఆన్‌లైన్ యాప్ (గొలుసుకట్టు) వ్యాపారంలో నగదు పెట్టుబడిపెట్టి మోసపోయిన బాధితులు సైబర్‌క్రైమ్ పోలీసులను శనివారం రాత్రి ఆశ్రయించారు. గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి ద్వారా 150 మంది యువకులు ఒక్కొక్కరు రూ.1,000 నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టారు. మొదట్లో అధికంగా నగదు చెల్లించిన కంపెనీ ఆ తర్వాత యాప్ సేవలు నిలిపేసింది. మధ్యవర్తి కృష్ణ ఫోన్స్ కూడా పనిచేయక పోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్న తరుణంలో ఆన్‌లైన్ యాప్ (ఎంఏఈఆర్ఎస్‌కే) సింబల్ కలిగి హైవేపై వెళుతున్న కంటైనర్ లారీ అడ్డగించి పోలీసులకు అప్పగించారు. వివరాలు సేకరించిన సీఐ పి.శ్రీను సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయించారు. మధ్యవర్తి కృష్ణ కూడా తన డబ్బులు పెట్టుబడి పెట్టి మోసపోయానని ఆన్‌లైన్ కంపెనీపై బెంగళూరులో ఫిర్యాదు చేశాడు.

సొంత ఖర్చులతో రహదారి మరమ్మతులు

తాతకుంట్ల (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెం రహదారి గోతులగా ఉండటంతో గ్రామానికి చెందిన ఇంజినీర్ మేడా శ్రీనివాసరావు సుమారు రూ.లక్ష తన సొంత ఖర్చులతో రహదారి మరమ్మతు పనులు ఆదివారం చేపట్టారు. రహదారిలో రాక పోకలకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ మేడా మల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు కట్ట ప్రసాద్ పాల్గొన్నారు.



రహదారి మరమ్మతులు పరిశీలిస్తున్న ఇంజినీర్ శ్రీనివాసరావు

విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ భేష్



హీల్ ప్యారడైజ్ స్కూల్ సీఈఓ అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు



నృత్యంతో అలరిస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

నూజివీడు: విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండటం అభినందనీయమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో హెల్పింగ్ హ్యాండ్స్ 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ రోజుకు ఒక రూపాయి చొప్పున ఫండ్ దాచి అవసరమైన పేద విద్యార్థులకు అందజేయడం ఎంతో మంచి కార్యక్రమమన్నారు. హీల్ ప్యారడైజ్ స్కూల్ సీఈఓ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించడం వల్ల మరింత మంది సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సమాజం మనకేమిచ్చిందని కాకుండా మనమేమిచ్చాం అని ఆలోచించాలన్నారు. 2009వ సంవత్సరానికి చెందిన నాగరాజు అనే విద్యార్థి తనకు హెల్పింగ్ హ్యాండ్స్ ఏ విధంగా సాయం చేసిందో వివరించారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సలీంబాబు మాట్లాడుతూ ఈ సంస్థను స్థాపించి ఎందరో పేద విద్యార్థుల చదువులకు, వైద్య ఖర్చులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థికసాయం అందజేశామన్నారు. అంతేగాకుండా ప్రతి సంవత్సరం పాత దుస్తులను సేకరించి పేదలకు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్నేహార్రైడ్స్ అనాథ ఆశ్రమ వసతిగృహం విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ట్రిపుల్ ఐటీ విద్యార్థుల మనస్సులను హత్తుకుంది. అలాగే ట్రిపుల్ ఐటీలోని ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్య, డప్పు, సంగీత ప్రదర్శనలను నిర్వహించడంతో పాటు సామాజిక బాధ్యతను తెలిపేలా నాటికను ప్రదర్శించారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాకపోవడంతో అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఎన్‌పురం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కాస త్రిమూర్తులు(71) అతని భార్య కేదారేశ్వరపేటలోని 6వ లైన్‌లో కుమారుడి కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న త్రిమూర్తులు భార్యతో కలిసి రైల్వే ఆస్పత్రిలో మందులు తీసుకుని రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్ఈ కాలనీలోని ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లారు. రాత్రి 8.30 గంటల సమయంలో త్రిమూర్తులు ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో త్రిమూర్తులు కుమారుడు కాస వెంకట కుమార్ ఆదివారం ఎస్ఎన్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన తండ్రికి మానసిక స్థితి సరిగా ఉండదని, గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లిపోయి కొండపల్లిలో దొరికినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



'నాడు-నేడు'తో అదనపు తరగతి గదుల నిర్మాణం



విద్యార్థులకు ఏర్పాటు చేసిన బెంచీలు

నాడు–నేడు పనులతో అభివృద్ధి

ఏ.కొండూరు: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పించి, నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. ఎన్నడూలేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చదువులకు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నాడు–నేడు ద్వారా పనులు చేయించడంతో కళకళలాడుతున్నాయి. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 247 మంది విద్యార్థినులున్నారు. వీరికి 13 మంది ఉపాధ్యాయులు విద్యను అందిస్తున్నారు.

రూ. 91 లక్షలతో నాడు–నేడు పనులు

ఈ విద్యాలయంలో రూ. 91లక్షలతో నాడు–నేడు పనులు చేయించారు. మొదటి విడత రూ.43 లక్షలతో తరగతి గదులు మరమ్మతులు, తాగునీరు, విద్యుత్, బెంచ్ బల్లలు, డ్రెయినేజీ సౌకర్యాలతో పాటు పలు రకాల పనులు చేయించి, అన్ని వసతులు కల్పించారు. రెండో విడత రూ. 48 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు.

మారిన విద్యా విధానం

విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద పథకాల అమలుతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఐఎఫ్‌పీ ద్వారా విద్యా విధానం, ట్యాబులు పంపిణీ చేసి, నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. 2018వ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టారు.

పెరిగిన హాజరుశాతం

నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో ఈ ఏడాది ఆరో తరగతిలో 40, ఇంటర్మీడియట్‌లో 40 మంది విద్యార్థుల హాజరుశాతం పెరిగింది. గత ఏడాది పదో తరగతిలో 63 శాతం ఉత్తీర్ణులయ్యారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు నాలుగు గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తుండటంతో తల్లిదండ్రులు ఈ విద్యాలయంలో పిల్లలను చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు.

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఆరో తరగతి నుంచి ఇంగ్లిష్ విద్యా విధానంలో మార్పు తీసుకురావడంతో ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే రీతిలో విద్యను అందిస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులకు గురి కాకుండా అన్ని రకాల వసతులు కల్పించాం. నాడు–నేడు పనులను నాణ్యతా ప్రమాణాలతో చేయిస్తున్నాం.

– షేక్ మీరున్నీసా, ప్రిన్సిపాల్

రోడ్లపై పశువులతో ట్రాఫిక్ ఇక్కట్లు

తిరువూరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో పశువులు అడ్డుగా తిష్ట వేస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. పశువులను యజమానులు బయటికి వదిలేస్తుండటంతో మెయిన్‌రోడ్డులోని దుకాణదారులు వేసిన వ్యర్థాలు తిని అక్కడే సంచరిస్తున్నాయి. గతంలో నగర పంచాయతీ అధికారులు పశువులను బందెల దొడ్డికి తరలించి, యజమానుల నుంచి జరిమానా వసూలు చేసి వాటిని అప్పగించేవారు.ఈ విధానాన్ని కొనసాగించి పశువుల కారణంగా కలుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.